# దొంగ వొస్తే బాగుణ్ణు!

ఏదో చప్పుడయింది బయట! అర్ధరాత్రి!

"తలుపు జాగ్రత్తగా వేశావా?" అనబోతున్నాడు గృహస్థు — కోడిగుడ్డు బుడ్డీ ఒత్తి ఎక్కిస్తూ.

ఎవరో తలుపు తోసుకుని రానే వచ్చేశారు లోపలికి! చేతిలో ఏదో వుంది. తుపాకీలాగుంది! అవునో, కాదో! నిజం తుపాకీ ఎప్పుడన్నా చూసి ఏడిస్తేనా వాళ్ళు?

బిగుసుకు పోయారు వృద్ధ దంపతు లిద్దరూ.

వచ్చినవాడు చిన్న కుర్రవాడే. ఇరవై రెండేళ్ళుంటాయేమో. గుడ్డి వెలుతుర్లోనే కందగడ్డలా ఎర్రగా కనబడుతున్నాడు. కరెంటు లైటైతే ఇంకెంత తెల్లగా మెరుస్తాడో! భుజానికి సంచి వేలాడుతోంది.

"యావండీ...." — భర్త చెవిలో, భార్య!

"దొంగేనే.... మన దగ్గిరేవుందిలే. చాపగుడ్డలూ, మనవూనూ."

"అవే లాక్కుంటాడేమో నం...."

"కదలకండి కబడ్దార్!"

"కబడ్దారెవరూ?" — భార్య!

"అబ్బ! వూరుకో, నన్నేలే" — భర్త!

ఎంత ముచ్చటేసిందో ఆవిడకి — తన భర్త కబడ్దారంటే. భర్త తాసిల్దారవ్వాలని ఎంత కోరికో చిన్నప్పణ్ణించీ.

"ఊఁ, తియ్యండి బైటికి!"

"......................"

"వినపడిందా? తియ్యండి."

" ఏవిటీ?.........."

"ష్! ప్రశ్నలేవిటి? తియ్యండి చప్పున."

"ఇది మరీ బాగుందోయ్! ఏమిటి చప్పున తీసేది? చెప్పరాదూ?"

"తాళం చెవులు."

పెళ్ళాం మొహం చాటంతయ్యింది. ముసలాయన్ని వేళాకోళంగా చూస్తూ — "ఇప్పుడేవంటారు? తాళం 'చెవు' లంటారండీ అంటే కాదని బుకాయిస్తారే!"

భర్తకి కొంచెం కోపం వచ్చింది — "ఏవోయ్! సరిగా చెప్పూ, తాళం 'చెవు'లంటారా, తాళం 'చేతు' లంటారా? తాళం 'చేతు'లనరూ?" అని కంగారుగా అడిగాడు.

దొంగ కుర్రాడికి చాలా కోపం వచ్చింది "తాళం చేతులేమిటి?.... చేతులూ, కాళ్ళూనూ.... తియ్యండి ముందు."

"చాల్లెద్దూ! చెప్పావుగా ఇందాకా. నేనడిగింది వినవేం? తాళం చెవులని ఎవ్వరూ అనరు. చెవులూ, ముక్కులూనూ! తాళం 'చెయ్యి' చక్కగా చేతి ఆకారంలో ఉంటుంది పొడుగ్గా. దానికి వేళ్ళూ. అదీనూ...."

భార్య కొంచెం తెల్లమొహం వేసింది తన వాదం వోడిపోతుందేమోనని. నువ్వే రక్షకుడి వన్నట్టు దొంగ కుర్రాడి వేపు జాలిగా చూసింది.

గృహస్థు రెట్టిస్తున్నాడు ఉత్సాహం పుంజుకుని — "చెప్పు, తాళం చెయ్యి పొడుగ్గా ఉంటుందా, ఉండదా?"

"'చెవ్వి' మాత్రం పొడుగ్గా ఉండదా?" అని దొంగ కుర్రాడు కోపంగా చూశాడు.

"హేవిటి? చెవ్వి చెయ్యంత పొడుగ్గానా?" అని తెల్లబోయాడు గృహస్థు.

'ష్! మాట్లాడకండి. తియ్యమన్నానా?"

"నువ్వెన్ని చెప్పు. మా ఊళ్ళో మాత్రం తాళం చేతులే అంటారు. చిన్నప్పట్నించి ఎరగనూ?"

భార్య ఈసడించింది — "మీ ఊరు సంగతి నాకు చెప్పకండి! మీ ఊళ్ళో వాళ్ళు ముందు పచ్చడి కలుపుకుంటారు అన్నంలో. అవ్వ! ఎవరైనా వింటే నవ్వుతారు. ముందు కూర కలుపుకుంటారు గానీ

పచ్చడి కలుపుకుంటారా ఎక్కడైనా? ఏం నాయనా, ముందు పచ్చడి కలుపుకుంటారా అన్నంలో?"

"పచ్చడా? పచ్చడేవిటి?" అన్నాడు దొంగకుర్రాడు విసుక్కుంటూ, మాటలు పెంచటం గిట్టనట్టు.

"అయ్యో! పచ్చడంటే ఎరగవూ?" అని ఇల్లాలు నొచ్చుకుంది — పచ్చడంటే ఎరగని వాణ్ణి సాక్ష్యం వేసుకున్నందుకు.

"పచ్చడంటే పచ్చగా ఉంటుంది, అదేనా? దాన్ని 'పసుపు' అంటారే మా ఊళ్ళో!" అన్నాడు దొంగ కుర్రాడు చిలిపితనంగా.

దంపతులిద్దరూ నిరుత్సాహపడి పోయారు. ఇతని వల్ల తాళాల సంగతీ తేలలేదు, పచ్చడి సంగతీ తేలే టట్టు లేదు. ఏం లాభం కొత్తమనిషి దొరికీ?

"ఏ ఊరు మీది?" అంది ఆవిడ కోపంగా.

"గుంటూరూ, ఏం?"

"గుంటూరేనా? ఆ పక్కన తుళ్ళూరా?" అని ఆవిడ ఉత్సాహం తెచ్చుకుంది.

"తుళ్ళూరా, గిళ్ళూరా! గుంటూరే మాది."

తుళ్ళూరుని గిళ్ళూరన్నందుకు ఆవిడకి మళ్ళీ కోపం వొచ్చింది — "గుంటూరు వాజెమ్మలకి పచ్చడి మొహం కూడా తెలిసి యాడవదా ఏవిటీ?" అని బుగ్గలు నొక్కుకుంది.

చెట్టంత గుంటూరు మనిషిని ఎదట పెట్టుకుని 'గుంటూరు వాజెమ్మ'లని భార్య తిట్టినందుకేం కొంప మునుగుతుందో అని, ముసలాయన కొంచెం నవ్వు మొహంతో సర్దేస్తూ — "గుంటూరు వారు పచ్చళ్ళు తింటారోయీ, నువ్వెందుకు తినలేదో గానీ" అని ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

"తినకపోతే మాన్లె, దానిపేరు విననే లేదతనూ!" అని విసుక్కుంది ఆవిడ.

దొంగ కుర్రాడికి కోపం పోయిందో లేదోనని ఆయన ఇంకా నవ్వు మొహంతోనే — "పోనీ, తాళం చేతులూ అనొద్దూ, చెవులూ అనొద్దూ. ఏం? ఊరికే 'తాళాలు' అందాం. సరేనా?" అని రాజీకి దిగాడు.

"ఆఁ, సరే! అలాగే అందాం. ఇవ్వండి తా... ళా... లు" అని కుర్రాడు మళ్ళీ కోపంగా చెయ్యి జాపాడు.

"అయ్యో! నిక్షేపంలా నించున్న వాడికి 'తాళాల' మాట గుర్తు చేశానే!" అని పశ్చాత్తాప్పడి, ముసలాయన గడుస్తనంగా — "ఏంవోయ్! గుంటూర న్నావు మీది, మల్లాది వారు తెలుసా నీకు?" అని మాటమార్చాడు.

దొంగ కుర్రాడికి చిరచిరలాడింది. వచ్చి ఇంత సేపైనా 'తాళాలు' బైట పడేయించలేని తన అసమర్థ తకి కోపం తెచ్చుకుని — "మల్లాది వారా, గిల్లాది వారా?" అని ఖయ్యిమన్నాడు.

"ఇతను అంతా 'గీ' భాష మాట్లాడుతున్నాడేవ్, మీ పెద్దన్న లాగా. ఇందాక 'తుళ్ళూరా, గిళ్ళూరా' అన్నాడు. ఇప్పుడు 'మల్లాదివారా, గిల్లాదివారా' అన్నాడు. అచ్చం మీ పెద్దన్న వ్యవహారమే."

"చాల్లెండి, మా వాళ్ళ సంగతెందుకూ ఈ అర్ధ రాత్రి పూటా? మా పెద్దన్నయ్యకీ, ఇతనికీ పోలికేవిటీ? నల్లేరు మీద బండిలా వాడి మీదికి పోతారు మీరూ."

"నేనిప్పుడేవన్నానే? ఆసి, నీ ఇల్లు బంగారం గానూ!"

"ఆఁ, 'బంగారం' అవుతుంది ఇల్లు! మిమ్మల్ని కట్టుకున్నాక ఇంకేం 'బంగారం' అవుతుంది? మట్టీ మశానవూనూ."

"అయ్యో! ఏవన్నానే నేనిప్పుడూ? అనవసరంగా రాద్ధాంతం చేసుకుంటావుగానీ — అవతల పెద్ద మనిషి ఉన్నాడన్న జ్ఞానమన్నా లేదు..."

"ఆఁ, మా మంచి పెద్ద మనిషే! నాకన్నా పెద్ద మనిషా ఏమిటి అతను? పాతికేళ్ళు లేని గుంటడు. గుంటూరు గుంటణ్ణి పట్టుకుని మా పెద్దన్నయ్యతో పోలుస్తారేం?"

"నీ పిచ్చి దొంగల్దోలా! అంతకోపమా! ఏవోయ్! నేనిప్పుడేవన్నా కాని మాటన్నానా, నువ్వే చెప్పు?"

గృహస్థుల దెబ్బలాటని ముసిముసి నవ్వుల్తో పరికిస్తూన్న దొంగ కుర్రాడు "'కాని' మాటంటే?" అని ఆశ్చర్యంగా చూశాడు.

"అయ్యో! నీ కసలు తెలుగు తెలుస్తోన్నట్టు లేదే! మీ తెలుగు మేస్టారెవరూ? ... అల్లా కూర్చో. ఎంతసేపు నిలబడతావూ?"

దొంగ కుర్రాడికి చప్పున తన కర్తవ్యం గుర్తొచ్చి మొహం గంభీరంగా పెట్టాడు. "మాటలతో చెబితే విన

రన్న మాట మీరు. తాళం చేతులిస్తారా, ఇవ్వరా?" అని తుపాకీ ఝుళిపించాడు.

"అదుగో! నువ్వూ తాళం'చేతు'లన్నావు. నువ్వూ తాళం'చేతు'లన్నావు. ... అన్నావా, లేదా? ఏమే! అన్నాడా, లేదా?" అని చప్పట్లు చరుస్తూ గోలచేశాడు ముసలాయన.

"ఏమో బాబూ! నేను వినలేదు. చేతులూ, మూతు లూనూ!" అని తప్పుకుందావిడ.

"ఇంతకీ మీరు తీస్తారా, తియ్యరా?"

"నువ్వు నా పాయింటుకి జవాబు చెప్పలేనప్పు డల్లా బెదిరిస్తున్నావోయీ! నేను కనిపెట్ట లేదనుకోకు. తల నెరిసిన వాణ్ణి."

"ష్! మాటల్లేవు. తాళాలివ్వండి!"

"ఎవరివీ?"

"ఇంకెవరివీ?"

"ఏమో, పక్కింటి వాళ్ళని అడుగుతున్నావేమో ననీ."

"చాలించండి చమత్కారం!"

పాతికేళ్ళు లేని కుర్రవాడు అంత మనిషిని పట్టు కుని అలా మందలిస్తే ఇల్లాలి మనస్సు చివుక్కు మంది. "'తాళాలివ్వండి, తాళాలివ్వండి' అంటావు. ఎక్కణ్ణించి తెచ్చివ్వం నాయనా? నువ్వొచ్చిన తలుపుకి గొళ్ళెమైనా ఉందా? మా ఇంటాయనకి ఎన్నిసార్లు చెప్పినా..."

ముసలాయనకి కోపం తారాజువ్వలాగ లేచింది. "ఛీ, ఇంటాయనేవిటి? పరాయి మగాణ్ణి పట్టుకుని 'ఇంటాయ'నట, ఇంటాయన! ... మా ఇంటి యజ మాని. అదే, 'ఇల్లు గలాయన' అనలేవూ?" అని ముస లాయన ముసలావిణ్ణి కసిరాడు.

"అబ్బ! కంగారులో అన్నాకానీ వూరుకుందురూ. 'ఇంటాయన' అన్నంత మాత్రాన ఇంటాయన అయ్యాడా ఏమిటి? నోట్లోంచి మాట వూడిపడ నివ్వరు."

"మొన్ననోసారి అలాగే అన్నావు."

"అంటే అన్నాను. ఏం తప్పొచ్చింది? 'దాన్ని పెళ్ళా డతా, దీన్ని పెళ్ళాడతా' అని మీరెంతెంత మాటలన్నా తప్పులేదు గానీ, ఆడదాని నోట్లోంచి ఒక్క ముక్క జారివొస్తే మీ పీక పట్టుకుంటుంది. మొన్న మా మేన గోడలొచ్చినప్పుడు... దాన్ని పెళ్ళాడతానన్నారా లేదా?"

"అదంతా ఎందుకిప్పుడు? ఊరుకో, పరాయి మగవాణ్ణి 'ఇంటాయన' అనడం ఏం బాగుంటుందని అడగడం తప్పా?"

"నేనూ అదే అడుగుతూంట. పరాయి ఆడదానితో వేళాకోళాలాడితే బాగుంటుందా అంటున్నాను. ఎప్పటి నించి ఉందో ఆ ముక్క నా కడుపులో. సమయం వొచ్చింది కాబట్టి అడుగుతున్నాను."

"మంచి సమయం కనిపెట్టావు, అవతల దొంగని పెట్టుకుని!"

"ఇదుగో, నన్ను, 'దొంగా, గింగా' అన్నారంటే ఒప్పుకోను" అని కసురుకున్నాడు దొంగ కుర్రాడు.

"నువ్వు ఒప్పుకుంటే మాకేవిటి, ఒప్పుకోకపోతే మా కేవిటి?" అని ఆయనా,

"మరి నిన్నెల్లా అనుకోమంటావూ?" అని ఆవిడా, అతని మీదికి ప్రశ్నలు గుప్పించారు.

"నేనేం దొంగని కాను. నేనూ మీ లాంటి వాణ్ణే!"

"సెబాసూ! ఇదొకటా? మేం అర్ధ రాత్రుళ్ళు ఎవ రిళ్ళల్లోనన్నా దూరుతున్నామా నీలాగా?"

"ఏం దూరితే? నేను రాత్రుళ్ళు దూరతాను, మీరంతా పగలే దూరతారు! మీరు పెట్టుబడి దారులు!"

"ఏవిటి? మేమ్ పెట్టు... పెట్టదారులమా? ఏం మాటన్నావూ? మళ్ళీ చెప్పూ."

"'పెట్టుదారులు' కాదు, 'పెట్టుబడిదారు' లన్నాను."

"పెట్టు... బడి... దారులా? ఇన్నేళ్ళ నించీ తెలుగు పాఠాలు చెప్పుకొస్తున్నాను. ఈ ముక్కెక్కడా తగల్లేదే నాకూ."

"ఆ 'ముక్క' తెలుగు పాటాల్లో వుండదు" కుర్రాడు వెటకారంగా అన్నాడు.

"పోనీ సంస్కృత గ్రంథాల్లోనూ తగల్లేదు."

"అక్కడా వుండదు."

"మరెక్క డుంటుందీ, వల్లకాట్లోనా?"

"ఇన్ని ప్రశ్న లనవసరం. మీరు పెట్టుబడిదారులే. లేకపోతే ఈ ఆస్తంతా మీకెలా వచ్చింది?"

"ఏ ఆస్తి?" అని దంపతులిద్దరూ ఒక్కసారే కేక లెట్టారు. వాళ్ళ నలభైయేళ్ళ కాపరంలోనూ అంత ఐక్యంగా మాట్లాడిన ముక్క అదొక్కటే!

"ఏ ఆస్తి నాయనా?" అన్నాడాయన మళ్ళీ తెల్లబోతూ.

"ఏ ఆస్తి అబ్బాయీ?" అని, తన కళ్ళకి కనపడని ఆస్తి ఏమన్నా అతనికి కనపడుతోందేమోనని ఆశగా చూసిందావిడ.

"అదుగో ... ఆ మూట ఏమిటి? ఆ డబ్బా ఏమిటి?" అని దొంగ కుర్రాడు ఆ చిన్న గదిలో ఆస్తికోసం గబగబా వెతికాడు కళ్ళతో. గదంతా చూశాడు. బొగులు బొగులుమంటూ వుంది కొంప. సామానే లేదు. అయినా, వాళ్ళకి ఆస్తి లేదంటే నమ్మకం కుదరలేదతనికి.

"ఆ మూట ఏవిటీ?" అన్నాడు మళ్ళీ గంభీరంగా ఉండే ప్రయత్నంతో చిన్న మూటని చూపిస్తూ.

"అదేవిటో అడుగుతున్నాడు. విప్పి చూపించవే అతనికీ."

"నా వల్లకాదు బాబూ! కావాలంటే అతన్నే విప్పుకోమనండి. ఆ మూట ముట్టుకున్నానంటే ఇప్పుడు గొౖంతుతో చస్తాడు."

"చూడబ్బాయీ! అవన్నీ పాతగుడ్డలు. బొంత కుట్టించాలని అలా పెట్టింది. దాని కసలే ఉబ్బసం తెగులు. గుడ్డల రవుజు పడిందంటే తెల్లవార్లూ, దగ్గుతూ కూర్చోవాలి."

"మీ మాటలు నేను నమ్మకేం? పెట్టుబడి దారులు డబ్బెక్కడ దాస్తారో నాకు తెలీదనుకుంటు న్నారా? పిడకల గూళ్ళల్లోనో, గుడ్డల మూటల్లోనో దాస్తారు."

"అన్నట్టు మళ్ళీ గుర్తు చేశావు. పెట్టుదారులంటే ఏవిటీ?"

"పెట్టుదారులు కాదు, 'పెట్టుబడి'దారులు."

"అదే, ఆ ముక్కే నా నోటికొచ్చి చావడం లేదు. ఆ దారులేమిటో కొంచెం చెపుదూ!" — ముసలాయన.

"మాకు చెక్క పెట్టెన్నా లేదు. మమ్మల్ని 'పెట్టి' దారులంటా వేమిటబ్బాయ్?" — ముసలావిడ.

"'పెట్టి'దారులా, 'బుట్ట'దారులా?" అని, ఎంత చెప్పినా అర్థం చేసుకోనందుకు చాలా కోపంగా చూశాడు దొంగకుర్రాడు.

"ఏమో, బుట్టదారులో, తట్టదారులో నువ్వన్న ముక్కేగా?" అని అంతకన్నా కోపం తెచ్చుకుంది ముసలావిడ.

దొంగకుర్రాడు కాస్సేపాలోచించాడు. లోకంలో 'పెట్టుబడిదారులూ — దొంగలూ' అని రెండు రకాలే ఉంటారని ఎవరో చెప్పారతనికి. పెట్టుబడిదారులు పగలు దోచుకుంటే, దొంగలు రాత్రుళ్ళు దోచుకుంటారని కూడా చెప్పారు వాళ్ళే. ఇతను మొదట చాలా ఆలోచించాడు — పెట్టుబడిదారు అవ్వాలా, దొంగ అవ్వాలా — అని! "పెట్టుబడిదారే అవుతాను" అన్నాడు చివరికి.

వాళ్ళు నవ్వి — "అది కుదరదులే. పగలు దోచుకోవాలంటే చాలా పెద్ద గొడవ వుంది దానికి" అన్నారు. దొంగ అవ్వాలంటే అంత పెద్ద గొడవ లేదన్నారు, 'చేతుల్నిండా ఆవదం రాసుకుని కత్తి పట్టుకుంటే చాల'న్నారు.

"కత్తి జారిపోదూ?" అని, పాపం ఇతను మంచి ప్రశ్నే వేశాడు.

వాళ్ళు విసుక్కుని — "గట్టిగా పట్టుకోవాలి. అంతే మరీ" అని కోపం చేశారు.

"రాత్రుళ్ళు నాకు నిద్రొస్తుందే!" అన్నాడితను బాగా ఆలోచించి.

"పగలు నిద్రపో" అన్నారు వాళ్ళు చాలా తెలివిగా. ఆ పాయింటుకి ఇతను ముగ్ధుడైపోయి, దొంగై పోయాడు. అంచేత, దొంగలు కాని వాళ్ళంతా పెట్టుబడిదారులని ఇతనికి బాగా తెలుసు.

"మీ పప్పులు నా దగ్గర ఉడకవ్. మూట విప్పండి — ఊఁ! విప్పండి" అని కోప్పడ్డాడు.

"పప్పు వండుకుని ఎన్నాళ్ళయిందో! వాక్కాయి లొస్తున్నాయండీ. రేపు గుప్పెడు పప్పు తెచ్చుకుంటే సీతామాలక్ష్మి కాసిన్ని వాక్కాయ లిస్తానంది. పప్పులో పడేసుకోవచ్చు అని ఆవిడ, 'వాక్కాయి పప్పు'ని తల్చుకుని సరదాపడింది.

"పప్పు కూడా ఇస్తుందేమో అడగరాదూ?"

"చాల్లెద్దురూ! మీ బుద్ధి పోనిచ్చుకున్నారు కారు. మీ తాతగారు యాయవారం చేసుకునే వారంటగా? అన్నీ ఆయన బుద్ధులే, పాడు బుద్ధులు! ఎక్కడికి పోతాయీ?'"

"మూట విప్పుతారా లేదా?" అని అరిచాడు దొంగ కుర్రాడు.

"మధ్యలో నీ గొడవేవిటయ్యా? ..."

"కావాలంటే నువ్వే విప్పుకోవోయ్!" అన్నాడు గృహస్తు నిర్లక్ష్యంగా. "ఏం ఉంది అందులో? ఒకటో రెండో ఎలకలొస్తాయి బయటికి?" అని వెటకారం చేశాడు.

"బాబ్బాబు! గడప అవతలికి తీసికెళ్ళి విప్పుకో నాయనా! దూళి నాకు పడదు. తెల్లవార్లూ ఆయాసంతో ఛస్తాను."

"తుపాకీకి లొంగేటట్టు లేరే! తుపాకీ పెట్టేసి కత్తి తియ్యనా?" అని కోపంగా అడిగాడు దొంగ కుర్రాడు.

"ఏం, తుపాకీ పని చెయ్యదా?"

"పిల్లలు ఆడే బొమ్మ తుపాకీలు లేవండీ? అల్లాంటిదే ఇది. నేను మొదటే అనుకున్నాను."

"అదేం కాదు. ఇది మంచి తుపాకీయే. కావాలంటే చూడండి."

"మరెందుకు పేల్చవూ?"

"అది నా ఇష్టం. తుపాకీతో పేల్చాలో, కత్తితో పొడవాలో, నా ఇష్టమా, మీ ఇష్టమా?"

"నీ ఇష్టవేలే. నీకెల్లా సుళువుగా ఉంటే అల్లాగే చేసుకో."

"అయ్యో! కత్తిపీట విరిగిపోయి వారం రోజులైంది. చెయ్యి విరగ్గొట్టుకున్నట్టుంది. పట్టుకెళ్ళి బాగు చేయించండీ అంటే వింటారా, పెడతారా? ఆ చాకుతో తరగడం నాకు వచ్చి చావదయ్యే! అయినా ఏం ఉండి చచ్చిందిలే తరగడానికి? ... సొరకాయలా, గుమ్మడికాయలా?"

"నాకు నిద్రొస్తొందే. మీరిద్దరూ మాట్లాడుకోండి" అని ముసలాయన చాపమీదకి ఒరగబోయాడు.

"ఖబడ్దార్!" అని దొంగ కుర్రాడు చిన్న అరుపు అరిచి, సంచిలోంచి చిన్న రేకు ముక్కలాంటిదాన్ని బైటికి తీశాడు.

"ఇదేనా కత్తి? పాపం సరిగ్గా చూసే కొనుక్కున్నావా?" అని జాలిపడింది ఇంటావిడ.

"నన్ను పడుకోనివ్వవోయీ! మీరు మాట్లాడుకోండి. నేనొద్దన్నానా?" అని ప్రాధేయపడ్డాడు తెలుగు మేస్టారు.

"కుదరదు! ఇంక మాటలు కుదరదు. డబ్బూ, నగలూ, తియ్యండి!"

"బాగానే ఉంది. వాటికోసం అయితే ఇంకా పైకి వెళ్ళు!"

"సరే, డబ్బక్కర్లేదు. నగలిచ్చేయ్యండి.... ఊఁ."

ఇల్లాలు బుగ్గలు నొక్కుకుంటూ "ఈయన మొహం చూస్తే పెళ్ళానికి నగలు చేయించిన రకం లాగే కనపడుతున్నారా నీకూ?" అంది. ఆవిడకి భర్త మీద అంత రుసరుస లెందుకో దొంగ కుర్రాడికి అప్పటికి బాగా అర్థమైపోయింది.

"అయితే నగలు కూడా లేవంటారా?"

"చాల్లేద్దూ! నీ వేళాకోళాలూ, నువ్వూనూ!" అని ఆవిడ మొహం చిట్లించింది.

"ఆ డబ్బాలో ఏవిటి? బియ్యం లేవూ! నా సంచి నిండా బియ్యం పొయ్యండి!"

"నీ సంచిలో ఎందుకూ? దాంట్లో ఇంకేమన్నా పెట్టుకోవచ్చు. మా డబ్బాయే పట్టుకుపోరాదూ?"

కుర్రాడు, తన తెలివి తక్కువకి నాలిక్కరుచుకున్నాడు — "అఁ, అదే. మిమ్మల్ని పరీక్షించడానికన్నాను. ఆ డబ్బా ఇటివ్వండి!"

ఇంటాయన కోపంగా డబ్బా మూత తీసి దాన్ని దొంగాడి వేపు గెంటాడు.

దొంగకుర్రాడు భయపడుతూ, భయపడుతూ డబ్బాలో చెయ్యి పెట్టి గుప్పెడు చిట్టు బైటికి తీశాడు.

"చూశావా, ఎన్ని బియ్యమో!" నవ్వాడు ముసలాయన.

"ఈ చిట్టెందుకూ?"

"గిన్నెలు తోముకోరూ?"

"అన్నం ఒండుకోని వాళ్ళకి గిన్నెలు తోముకోడం ఎందుకూ?"

"చాకులాంటి వాడివోయ్! ముచ్చటేస్తూంది నిన్ను చూస్తూంటే."

'మన చాకు కూడా తెగి చావటం లేదండీ. పదునుపోయింది."

"చెప్పండి. ఈ చిట్టెందుకూ? ఇందులో రత్నాలో ఏవో దాచారు. అవునా?"

"అయితే వెతుక్కో. ముంజేతి కంకణానికి అద్ద మెందుకూ?" అని ఆయనా,

"ఎప్పుడో కొని పోశాం. అల్లా వుంది. బియ్యం అయినంత తొందరగా చిట్టు అవుతుందటయ్యా?" అని ఆవిడా!

దొంగకుర్రాడు గదంతా మళ్ళీ పరికించాడు — "ఆ చాపల కింద డబ్బు లేదని ఏమిటి నమ్మకం నాకు? తియ్యండి చాపలు!" అని కేకపెట్టాడు.

"అబ్బబ్బా. ఏం గొడవొచ్చి పడిందమ్మా, ఈ దొంగాడితో" అని విసుక్కుంటూ ఇద్దరూ ఇటూ అటూ జరిగి చెరో చాపముక్కా పైకెత్తి పట్టుకున్నారు.

గుప్పెడు నల్లులు అటూ ఇటూ పరిగెత్తాయి. దొంగ కుర్రాడి వేపు వచ్చిన నల్లుల్ని అతను కూడా ఉత్సాహంగా కాళ్ళతో రాసి చంపాడు. నల్లుల్ని చూస్తే మా చెడ్డ కోపం అతనికి. అంతలోనే, ఆ కొంపలో చాపకింద కూడా డబ్బు మూటలు లేకపోవడం చూసి బాగా నీరసపడిపోయాడు. "ఎక్కడో దాచేశారు డబ్బు. డబ్బు లెక్క పెట్టుకోడానికి కాకపోతే ఈ అర్ధరాత్రి నిద్ర పోకుండా ఎందుకు కూర్చున్నారు?" అని కళ్ళెర్ర జేశాడు.

"పుట్టెడు నల్లుల్ని చూసి అదేం మాటయ్యా? ముసలాయన 'వీపు గోకవే' అంటేనూ లేచి గోకు తున్నాను. అంతలో నువ్వొచ్చావు. మంచాలున్నప్పుడు ఇంత పచ్చికలి లేదమ్మా. మంచం కోళ్ళకి ఏ కిరసనాయిలో, చీమలమందో రాస్తే నల్లులు చేరేవి కావు" — అందావిడ.

"చీమల మందుకి నల్లులు పోతాయా?" అని ఆశ్చర్యపడ్డాడు దొంగ కుర్రాడు. "మంచాలేం చేసు కున్నారూ?"

"అమ్మేసుకున్నాం నాయనా! మంచాలేమిటి, పెట్టెలేవిటి, గిన్నెలేవిటి — అన్నీ అమ్మేసుకున్నాం."

"ఎందుకూ? ఈయన పేకాడతాడా?"

"ఛ, పాపం మాటలు, అలాంటి పనులు లేవు. వీళ్ళ వంశం అంతా కాస్త తిక్క మేళమేగానీ అలాంటి పాడుపనులు లేవులే."

"ఆ సోదంతా ఎందుకే? అసలు ముక్క చెప్ప రాదూ? ఆర్నెల్ల నించీ జీతాలు లేవోయ్. అదీ సంగతి. కడుపునిండా తిండిలేదు. రాత్రిళ్ళు నిద్రలేం పట్టేడు స్తాయి?"

అప్పటికి నమ్మకం కుదిరింది దొంగ కుర్రాడికి.

"అయ్యో పాపం! ఎల్లా బతికేడుస్తున్నారూ?" అంటూ తలుపు చెక్క వెంట కిందకి జారి అక్కడే చతికిలబడ్డాడు.

"ఎంత చల్లగా అడిగావు నాయనా! గవర్నమెంటు వాళ్ళకే పట్టింది కాదు. రోజులెల్లా గడుపుకుంటు న్నామో అని ఎవరాలోచిస్తున్నారూ?"

"జీతం వచ్చినప్పుడు అంతా కట్ట కట్టుకుని వస్తుం దిగా?" అన్నాడు కూర్చున్నాక కూడా కోపంగా దొంగ కుర్రాడు.

"ఏం వస్తుంది నాయనా? అన్నీ అప్పులే. జీతా లొచ్చే రోజు షాపుల వాళ్ళు ఆఫీసు దగ్గిరికి రారూ? వడ్డీలతో సహా గోళ్ళూడగొట్టి పుచ్చుకుంటారు."

"అవును కానీ మేస్టారూ! 'గోళ్ళూడగొట్టి' అనే మాట ఎందుకొచ్చిందండీ? ఇల్లాంటివి తెలుసుకోవా లని నాకు భలే సరదాగా ఉంటుంది. పూర్వం గోళ్ళూడగొట్టి వసూలు చేసేవారా అప్పులు?"

అల్లాంటివి చెప్పడం మాస్టారికి కూడా సరదాయే.

"అప్పులు కాదోయ్! రైతుల్ని అంత బాధపెట్టి శిస్తులు వసూలు చేసేవారు చక్రవర్తులు."

"ఆఁ, అదీ. ఇప్పుడు గుర్తొచ్చిందండీ. పెట్టుబడి దారులంటే చక్రవర్తులన్న మాట. ఇందాక గుర్తురాక చెప్పలేదు."

"అవ్వ! మమ్మల్ని నువ్వు చక్రవర్తులనుకున్నావా? నీకేమన్నా మతి ఉందటోయ్?"

భర్త చెవిలో గుసగుసగా "పిచ్చాసుపత్రి నించి వచ్చాడేమోనండీ" అంది ఆవిడ.

"ఇదుగో. మీరల్లా నెమ్మదిగా మాట్లాడుకుంటే నాకు సరిగ్గా వినపడ్డం లేదు."

"నీ మాట కాదులే. నీకు వినపడ్డం ఎందుకూ?" అని ఆవిడ విసుక్కుంది.

"చక్రవర్తి అంటే ఎంత మందీ, మార్బలం. ఎన్ని ఏనుగులూ గుర్రాలూ, ఆయన సింహాసనం మీద కూర్చుంటాడయ్యా, మా లాగా నల్లుల చాపమీద పడుకుంటా డనుకున్నావా?"

" 'సింహాసనం' అంటే?"

"సింహాసనం అంటేనా? ... సింహా... అది ఒక పెద్ద ఆసనం అనుకో, కుర్చీ అనుకో."

"మరి, 'కుర్చీ' అనెయ్యరాదూ? 'సింహాసనం, గింహాసనం' అని వెధవ నోరు తిరగని మాట లెందుకు? మా తెలుగు మాస్టార్ని తలుచుకుంటే భలే ఒళ్ళు మండిపోతుంది ఇప్పటికీ. చంపేసేవాడు. ఇల్లాంటి గొట్టు మాటలన్నీ కంటతా పట్టించడం చాలక, డిక్టేషన్ రాయాలి. అన్నట్టు, ఆడవాళ్ళు జంజ్యం వేసుకోరెందుకండీ మాస్టారూ? ఎవర్ని అడిగినా చెప్పరు. మా మాస్టార్ని అడిగితే చావబాదేసే వాడు."

"ఎవరు నాయనా ఆయనా? నీ విద్యాభ్యాసం గుంటూరులోనేనా?"

"ఆఁ. గుంటూరులోనే. మల్లాది రామశాస్త్రులు గారనీ, ఆయన మా బంధువే. ఆయనే మాకు ప్రైవేటు వెలగ పెట్టేవాడు."

"ఏవిటి? మీరు బ్రాహ్మలా?"

"పైగా మన శాఖేనండీ!" — ఆవిడ!

"అబ్బ, ఏం బాదేవాడండీ మా పంతులు! రాళ్ళ లాంటి పజ్యాలిచ్చి నవల మనేవాడు. అవన్నీ ఏం పనికొచ్చినయ్ నాకిప్పుడు? టెన్త్ పేసయ్యాను. దేశ మంతా తిరిగినా ఉద్యోగం ఇవ్వరు. వంద పద్యాలు అప్పచెబుతాను. రోజుకి పది రూపాయలు దొరుకు తాయా? నాలుగేళ్ళు చూసిచూసి విసిగెత్తి ఈ ఉద్యో గంలో కుదిరాను. పెళ్ళీ పెటాకులూ లేనివాణ్ణి కాబట్టి ఎలాగో ఈడుస్తున్నాను — అన్నట్టు ఆడవాళ్ళు జంజ్యం ఎందుకు వేసుకోరండీ?"

ఆ సంగతే ఇందాకట్నించీ ఆలోచిస్తున్నాడు తెలుగు మాస్టారు, ఏం చెప్పాలా అని.

దొంగ కుర్రాడికి వీపుమీద సూది పొడిచినట్టయి వెనక్కి తిరిగి చూసి తలుపు వెంటా, గోడ వెంటా, నల్లుల్ని చంపడంలో పడ్డాడు.

దొంగ కుర్రాడు బ్రాహ్మల కుర్రాడనీ, తమ శాఖే నని, పదో క్లాసు చదివాడనీ, ఇంకా పెళ్ళి చేసుకో లేదనీ — ఒక్కో ముక్కా వింటున్న కొద్దీ ముసలావి డకి ఆనందంతో మతిపోయింది. భర్తని కొంచెం వెనక్కి లాగి — "యావండీ! మా చిన్నన్నయ్య గారి అఖరి పిల్లకి సంబంధం కుదరక సతమతమవుతున్నారుగా? ఇతన్ని మాట్లాడితే?" — సలహా అడిగింది.

"ఛీ! దొంగాడికా?"

"దొంగాడేవిటండీ? అతని వృత్తి అతనిదీ! కోటి విద్యలూ కూటి కొరకే అన్నారు. నిక్షేపంలాగున్నాడు కుర్రాడు. మన కులంవాడూ, మన శాఖ వాడూనూ."

"సరే, ఆలోచిద్దాంలే."

"మీ ఆలోచన బంగారంగానూ, ఇంకెప్పుడూ? ఇతను కాస్తా పక్క వాళ్ళింటికి పోయాడంటే, వాళ్ళింట్లో ఎదిగిన పిల్ల లేదూ? వాళ్ళు పోనిస్తారా ఈ సంబంధం? కొంపదీసి ఆ పిల్లా, వీడూ ప్రేమించుకున్నా ప్రేమించు కుంటారు. ఈ కాలంలో ఎంతసేపు కావాలి ప్రేమకీ? ఒక్కసారి చూసుకుంటే చాలు!"

ముసలాయన అనుమానంగా చూస్తూ "నీకెట్లా తెలుసూ ప్రేమల సంగతీ?" అన్నాడు.

"చాల్లెద్దురూ! అన్నిటికీ అనుమానాలేనా! సిని మాల్లో చూడ్డం లేదూ? ఇంతకీ అతన్ని అడుగుతారా లేదా? ఇంత మంచి సంబంధం పోగొడతారా ఏవిటీ?"

"సరే, సరే, సందు చూసి కదుపుతాలే."

"ఏవిటలా గుడగుళ్ళాడు కుంటున్నారు?" దొంగ కుర్రాడు!

"అదేనోయ్! మొన్న ఎన్నికల్లో నువ్వు వోటెవరి కేశావో అడగమంటోంది. ఎవరికేశావేమిటి?"

"మీరెవరికేశారూ?"

"ఇంకెవరికి? ఇందిరా గాంధీకే. నువ్వో?"

"నాకలాంటి పక్షపాతం లేదు. అందరికీ కొట్టే శాను."

"అయ్యయ్యో! అలా చేస్తే వోటు పనికిరాకుండా పోతుందోయ్."

"పోతుందా?"

"ఇంకా అడుగుతావా?"

"అందుకే అలా చేశాన్లెండి. ఎవర్ని గెలిపిస్తే

మాత్రం మనకేం పొరుగుతుందండీ?"

"మంచి మాటన్నావు నాయనా! నీ కడుపు చల్లగా... ఏవండీ, అడగండీ?"

"అడుగుతున్నానే! వోటు అల్లా ఎందుకు పాడు చేశావోయీ? పైగా చదువుకున్న వాడివి కూడానూ."

"అయ్యో! ఆ గోలెందుకండీ ఇప్పుడూ? దొంగలు పడ్డ ఆర్నెల్లకి కుక్కలు మొరిగాయనీ... నేనే అడిగేస్తా లెండి. ఇదుగో అబ్బాయ్! మా అన్నయ్యగారి ఆఖరు పిల్ల... బంగారం బొమ్మ అనుకో... నువ్వు నించో మంటే నించుంటుంది, కూర్చోమంటే కూచుం టుంది...."

దొంగ కుర్రాడు కంగారు పడిపోయి తడబడుతూ "ఏవిటీ? మీ అక్కయ్యగారి చిన్న పిల్ల నేను కూర్చో మంటే నించుని, నించోమంటే కూర్చుంటుందా! అదేం పిచ్చి?" అని పిచ్చి చూపు చూశాడు.

'అయ్యో! తొందర పడతావేం? సరిగ్గా వినూ. నీ గుణగణాలు మాకు నచ్చాయి. ఆ పిల్లని నీకిస్తాం. చేసుకోవాలి నువ్వు. కాదనకు సుమీ! పెద్ద దాన్ని అడుగుతున్నాను."

"ఏం చేసుకోమంటారు నన్ను?"

"పెళ్ళి చేసుకోవయ్యా!"

"అదా మీ అభిప్రాయం? పిల్లకి నగలేమన్నా వున్నయ్యా?"

"ఆс, ఎందుకు లేవూ? బాలతొడుగు లేకుండా కన్నె ధారెలా పోస్తారూ? ... ఒక ముక్కు పుడకానూ..."

"ఇంకా నయ్యాం! ముక్కు పుడకతోటీ, చెవ్వి పుడకతోటీ అప్ప చెపుతారన్న మాట!"

"మిగతావి నువ్వు సంపాయించుకో! నీ చేతిలో పనీ!"

"అదేం కుదరదులెండి. పెళ్ళి మాటెత్తకండి!"

ఆవిడకి రోషం వచ్చింది — "పిలిచి పిల్లనిస్తా మంటే ఏదో అన్నాట్ట! దొంగాడికి కూడా ఎంత నీలుగో!"

"మరేమిటనుకున్నావూ ఈ రోజుల్లో? నేను కాబట్టి ఆ రోజుల్లో నీకు అప్పనంగా దొరికాను."

దొంగకుర్రాడు నవ్వుతూ — "పిల్ల దొరికినందుకు సంతోషించండి! లేకపోతే మీకు పెళ్ళయ్యేదా అసలు? అద్దం చూసుకున్నారా ఎప్పుడన్నా?" అన్నాడు చిలిపిగా.

"పుట్టినప్పుడే అరవై ఏళ్ళవాణ్ణనుకుంటున్నావా ఏవిటోయ్ నన్ను?"

దొంగ కుర్రాడు నవ్వేస్తూ — "సరదాగా అన్నా లెండి. మీ ఇద్దర్నీ చూస్తే నాకేమనిపిస్తోందో తెలుసా? చెప్పమన్నారా?"

"దానికేం? చెప్పు!"

" 'జన్మలో పెళ్ళి చేసుకో కూడదని'పిస్తోంది."

"ఏం? ఎందుకూ?" అరిచారు దంపతులిద్దరూ!

"అర్ధరాత్రుళ్ళు కూడా పోట్లాటలే! చిలకా గోరింక ల్లాగా కువకువ లాడుతూ, పకపక లాడుతూ ఉండాలి గానీ."

"అలా గడ్డిపెట్టు నాయనా ఈయనకి."

"మీరేం తక్కువ తిన్లేదు లేండి."

"భలే మాటన్నావోయ్. ఇంత కాలానికి చూశాను నీలాంటి వాణ్ణి."

"చాల్లెండి! మీరే ఎక్కువగా పోట్లాడుతారు ఆవిడతో."

"ఆс, పోట్లాడుకున్నాం, నిజమే. మా కష్టాలు నీకేం తెలుస్తాయి? పిల్ల కాకికేం తెలుసు ఉండేలు దెబ్బ? ఆర్నెల్ల నించీ జీతాలు రాక మేం చస్తోంటే?"

"జీతాలు రాకపోతే, జీతాలివ్వని వాళ్ళమీద పోట్లాడండీ వెళ్ళి! అంతేగానీ ... మీరిద్దరూ పోట్లాడు కోడం ఎందుకూ?"

"నువ్వు మాత్రం? పది మంది నిరుద్యోగుల్ని కలుపుకుని ఉద్యోగాలివ్వని వాళ్ళమీద పోట్లాడ రాదూ? ఈ దొంగ బతుకెందుకూ? తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరట! మనిషన్న తరువాత కష్టపడి బతకాలోయ్!"

"నేనిప్పుడు కష్టపడకుండా బతుకుతున్నా నంటారా? నే నెక్కే గోడలు మీరిద్దరూ ఎక్కండి, చూస్తాను."

ఆవిడ చాలా కోపం తెచ్చుకుంది "ఎక్కితే మీరి ద్దరూ ఎక్కండి గానీ, నన్నెందుకు కలుపుతారూ?"

ఆయనా కోపం తెచ్చుకున్నాడు "ఎక్కితే మీరిద్దరే ఎక్కండి. నాకేం పని గోడలెక్కేదాకా? ఇంకో నెల్లాళ్ళ

కన్నా నా జీతం నాకొస్తుంది."

"ఈ లోగానో?" అని చిలిపిగా నవ్వాడు దొంగ కుర్రాడు.

ముసలావిడకి మెరుపులా ఒక ఐడియా వచ్చి — "మా పిల్లని చేసుకో. గోడలెక్కించుకుంటావో, గొంటె లెక్కించుకుంటావో... దానికి నువ్వూ, నీకు అదీనూ! తోడూ నీడా, ఈడూ జోడూనూ! కష్టపడి బతకండి!"

"అదేం కుదరదు లెండి. నేను ప్రేమిస్తేగానీ, పెళ్ళి చేసుకోను."

"అంటే...?" — ఆయన.

"అంటేనా? మీరు సినిమాలు చూడరా బొత్తిగా?"

ఆవిడ భర్త చెవిలో గుసగుసలతో — "పెళ్ళికి ముందే ముద్దు పెట్టుకుంటారండీ. అదీ ప్రేమంటే."

ఆయనకి కోపం వచ్చేసింది. "నీకెల్లా తెలుసే విటి?"

"చాల్లెద్దురూ! ఇదొకటి నేర్చారు బాగా. సందట్లో సడేమియా అనీ ఎప్పుడు సందు దొరుకుతుందా అని చూస్తూ కూచుంటారు. మీ మాటలకేమొచ్చేగానీ, ఇదిగో నాయనా! సరే, అలాగే నీ ఇష్టం. ప్రేమించు మా పిల్లనే."

"ఛీ! అదేమిటే? ఎంత అప్రదిష్ఠ?"

"మరి దానికి పెళ్ళెలాగండీ? కట్నాలివ్వగలమా, ఏమన్నానా?"

"నేనే చేసుకుంటాలెద్దూ, నీ మేనగోడల్నీ."

"అదుగో, ఆ మాటే వొద్దన్నాను."

"సరే, నాకెందుగ్గానీ మీరిద్దరూ మాట్లాడుకోండి" అంటూ మేష్టారు చాపమీదకి ఒరిగాడో లేదో సూది పోటుకి ఉలిక్కిపడిలేచి, వీపు బరుక్కోవటం మొదలెట్టాడు.

"టిక్ ట్వంటీ వాడాలి మేష్టారూ నల్లులికీ. పది సీసాలైతే ఈ గదికి సరిపోవచ్చు ...." అని దొంగ కుర్రాడు సలహా ఇచ్చాడు.

"మింగ మెతుకులేదు గానీ, ఆ టిక్కులూ టక్కులూ మాకెల్లా వొస్తాయి నాయనా? చెప్తే నమ్మవు గానీ ఇవ్వాళ రెండుపూటలా తిండిలేదు. తిండిలేకే నిద్రపట్టడం లేదు."

"అయ్యో! అలాగా?" అని దొంగ కుర్రాడు చాలా జాలిపడ్డాడు. "చెప్పరేం మరీ?" అని కసిరాడు. గబ గబా సంచిలోంచి ఒక పొట్లాం తీసి "ఇదిగో! చాలా మిగిలాయి. తీసుకోండి. తినండి ఇద్దరూ!" అని ఆప్యాయంగా పొట్లాం అందించాడు.

పొట్లాం విప్పి చూస్తే ... ఘుమఘుమలాడే క్రీమ్ బిస్కట్లు! మెత్తని రొట్టె!

"నీ డబ్బుతో కొన్నావా? లేకపోతే ఎక్కడన్నా..."

"డబ్బుతో కొంటేమాత్రం? ఆ డబ్బెక్కడిదీ?"

"అవున్లే, ఉన్నమాటన్నావు" —ఆయన.

"నీ కడుపు చల్లగా...! మీ అమ్మ కడుపు చల్లగా" — ఆవిడ.

"కత్తి ఒకటి విరిగిపోయిందండీ. పనికి ఇబ్బందిగా ఉంది. అదే వచ్చింది చిక్కు!"

"మా బత్తాయి చాకు పనికొస్తుందేమో తీసుకుంటావా పోనీ? దానితో మాకేం పనేడిసింది గనకా?"

"బత్తాయి చాకులూ, ఉల్లిపాయి చాకులూ లాభంలేదు. దానికంతా ఉందిలెండి ... అబ్బో, చాలా సేపు కూర్చున్నాను. ఇంకా చాలా ఇళ్ళు చూసుకోవాలి" అని లేచాడు.

"రోజుకి ఎన్నిళ్ళు చూస్తావేమిటి?"

"ఏదీ, ఇల్లాంటి కొంపైతే ఒక్క దాంతోటే సరి!" వెళ్ళడానికి తలుపులు తీసి "గొళ్ళెం అన్నా బాగుచేయించుకోవాలని తెలీదూ?" అని కోపంగా వెనక్కి తిరిగి చూశాడు.

"మా ఇంటాయనకి ఎంత చెప్పినా?..." అంది ఆవిడ.

ఆయన మండిపడుతూ — "అదుగో, మళ్ళీ అదే వరసా?" అని ఖయ్యిన ముసలావిణ్ణి కసిరాడు. "మా ఇంట్లో ఏం ఉంటుందోయ్? గొళ్ళెం లేకపోతే మాత్రం ఏం పోతుందీ?"

దొంగ కుర్రాడు చీకట్లోకి దూసుకుపోతూ మండిపడ్డాడు — "మీకేం పోదులెండి. మరి నా సంగతేమిటి? నాకెంత టైమ్ వేస్ట్! గొళ్ళెం వుంటే, నేనింకో ఇంటి కన్నాపోయే వాణ్ణి కదా?"

[20-2-1980 'ఆంధ్రప్రభ' వారపత్రికలో] ★